# నిస్సీ జయధ్వజము

విడి పత్రిక రూ 8/-

అక్టోబర్ - 2017 క్రైస్తవ ఆధ్యాత్మిక మాస పత్రిక సంవత్సరపు చందా రూ. 100/-


# దేవునికి ఇష్టునిగా మారాలంటే

**"“నేను యెష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని అతడు నా ఇష్టానుసారుడైన మనుష్యుడు అతడు నా ఉద్దేశములన్నియు నెరవేర్చునని చెప్పి అతనిని గూర్చి సాక్ష్య మిచ్చెను. (అపో.కా 13 : 22).”**

ప్రియమైన దేవుని బిడ్డలారా! ఇక్కడ వ్రాయబడిన లేఖన భాగాన్ని మనము గమనిస్తే ఇక్కడ ఒక వ్యక్తి గురించి సర్వాధికారియైన దేవుడు సాక్ష్యం పలుకుతున్నాడు. ఒక మనిషి గురించి మరొక మనిషి సాక్ష్యమివ్వడము ఈ లోకములో మనము చూస్తాము. ఒక మనిషి గురించి మరొక మనిషి మంచి సాక్ష్యమైనా ఇవ్వవచ్చు లేదా చెడుసాక్ష్యమైనా ఇవ్వవచ్చు. సాక్ష్యాన్ని బట్టి ఆవ్యక్తి ఏమై యున్నాడు? సాక్ష్యాన్ని బట్టి ఆ వ్యక్తి మంచివాడా? చెడ్డవాడా? అనేది తెలిసి పోతుంది. అది తన సహోదరుని గురించి కావచ్చు, తన స్నేహితుల గురించి లేదా తన భార్యగురించి తన పిల్లలగురించి ఎవరి గురించి మనం మాట్లాడుతున్నా ఆ వ్యక్తి గురించి మనం మంచి సాక్ష్యం పలికితే మంచివానిగా చూస్తాము. లేదా ఒక వేళ చెడుగా సాక్ష్యం చెపితే చెడ్డవానిగానే చూస్తాము ఆవ్యక్తి మంచివాడైనా ఆవ్యక్తి యొక్క వ్యక్తిత్వం మంచిదైనా చెడ్డసాక్ష్యం చెపితే ప్రజలందరు కూడా అతన్ని

చెడ్డవానిగా, దుర్మార్గునిగానే చూస్తారు.

సాక్ష్యం మానవుని యొక్క జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో గమనించారా? కావున మనము నివసిస్తున్న సమాజము మధ్యలో దేవుని ప్రజలముగా మంచిసాక్ష్యమును పొందియుండాలి. మనుష్యులు సాక్ష్యాన్ని మార్చేస్తారుకాని ఆకాశమందున్న దేవుడు మాత్రము మంచివారిని మంచివారని, చెడ్డవారిని చెడ్డవారు అని సాక్ష్యమిస్తారు. నీ గురించి ఎవరు ఏరకంగా సాక్ష్యం చెప్తున్నా దేవుడు నీ గురించి మంచి సాక్ష్యమిచ్చే బిడ్డగా నీవు బ్రతకాలి. ఇక్కడ దావీదుగురించి ఆకాశమందున్న దేవుడు ఏమని సాక్ష్యమిస్తున్నాడంటే

**"నేను యెష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని అతడు నా ఇష్టానుసారుడైన మనుష్యుడు (అపో. కా 13.22)".**

ఈరోజు దేవుడు నీ గురించి ఏవిధమైన సాక్ష్యాన్ని ఇస్తున్నాడు? దేవుడు దావీదు గురించి పలికిన సాక్ష్యము నేను కూడా కలిగియున్నానని నీవు చెప్పగలవా? దేవుడు అంటున్నాడు నేను దావీదు గురించి చెప్పిన రీతిగా నీ గురించి చెప్పగలగాలి. అలాంటి సాక్ష్యం కలిగి నీవు జీవించాలి. దావీదు గురించి సాక్ష్యం చెప్పాడంటే దావీదు దేవునికి ప్రియునిగా జీవించాడు గనుకనే దేవుడు అతని గురించి సాక్ష్యమిస్తున్నాడు. దావీదు జీవితములో చిన్నచిన్న పొరపాట్లు ఉన్నాయి, దోషాలు ఉన్నాయి, అపరాధాలు ఉన్నాయి. విస్తారమైన రక్తాన్ని చిందించినవాడు. ఒక స్త్రీ కొరకు ఆమె భర్తను చంపించి ఆమెను తనకు భార్యగా చేసుకున్నాడు. ఇలాంటి పనులు చేసినా దావీదు వెనువెంటనే పశ్చాత్తాపపడ్డాడు. రాజు కదా ఏదైనా చేయ్యవచ్చు! దావీదు పొరపాట్లు చేసినా దావీదు గురించి దేవుడు ఎందుకు సాక్ష్యమిస్తున్నాడు? అతను నా ఇష్టానుసారుడైన మనుష్యుడు- అని నీవు నీ గుండెమీద చెయ్యి వేసుకొని నేను యేసయ్యకు ఇష్టానుసారమైన మనుష్యుని అని నీకు నీవే చెప్పగలవా? నీవు అలా జీవించక నేను ఇష్టానుసారమైన మనుష్యున్ని అని చెప్పావంటే నీ మనస్సాక్షి నీ మీద నేరారోపణచేస్తుంది. నీ క్రియలు నీ ఆలోచనలు నీ నడక సరిగాలేవు ఇలా ఉండి నేను ఇష్టానుసారమైన మనుష్యుని

అంటే నీ మనస్సాక్షి నిన్ను దొంగ అని సాక్ష్యం పలుకుతుంది. నీ మనస్సాక్షే నీ మీద నేరారోపణ చేస్తుంది. నీ మనస్సాక్షి నీమీద  దోషారోపణ చేయకుండా ఉండాలంటే దేవుని ద్వార నీవు మంచి సాక్ష్యాన్ని పొందాలి. ఒకవేళ నీవు నీ బంధువులకు , స్నేహితులకు, తల్లిదండ్రులకు, నీ భర్తకు, నీ భార్యకు, నీ పిల్లలకు ప్రీతిగా ప్రేమగా మంచి వ్యక్తిగా నీవు ఉండవచ్చు! కాని జీవము కలిగిన దేవునిదృష్టిలో నీవు ప్రీతికరముగా ఉన్నావా? దేవునికి ఇష్టానుసారముగా, దేవుడు మెచ్చుకొనే కోణములో నీ కాలమును గడుపుతున్నావా? ప్రియ చదువరి ఒకసారి ఆలోచించు! ఇక్కడ

గమనించండి, దావీదు ఎందుకు దేవునికి ప్రీతికరముగా మారాడు? దేవునికేమైనా బిర్యాణి పెట్టాడా? లేక దేవునికి ఏదైన గొప్పకార్యం చేసి పెట్టాడా? ఎందుకు దావీదు దేవునికి ఇష్టునిగా మారాడు? కారణాలేమిటి? తెలుసుకుందాము.

## 1. మంచి ఆరాధికుడు

మొట్టమొదట దావీదు జీవితములో ఉన్న ప్రత్యేకత ఏమిటంటే  దావీదు మంచి ఆరాధికుడు. అన్నిటికంటే దేవుడు బహుగా ఇష్టపడేది ఆరాధన (Worship) ఆరాధన అంటే దేవునికి చాలా ఇష్టమైనది. పరలోకములో కొన్ని కోట్ల దేవదూతలు దేవునిచేత సృష్టించబడినాయి. ఎందుకొరకు అవి సృష్టించబడ్డాయి? వాటిద్వారా ఏదైనా పని ఉందా? అవి వ్యవసాయం చేసేది ఉందా? ఉద్యోగం చేసేది ఉందా? కష్టపడే పని ఏమి లేదు. అవి కేవలము ప్రభువును ఆరాధించడము కొరకే సృష్టించబడినాయి. ఏక స్వరముతో పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని గాణప్రతిగాణములు చేస్తాయి. ఆ దేవధూతలలో  ఒక లూసిఫర్ దూత మరి ప్రత్యేకముగా సంగీతముకొరకే ఏర్పరచబడింది కాని తన గర్వము దానిని నాశనానికి నడిపింది. తద్వార దేవున్ని ఆరాధించే ఆధిక్యతను అదిపోగొట్టుకుంది. ఆ దూత పోగొట్టుకున్న ఆ ఆధిక్యతను మానవునికి దేవుడు ఇచ్చాడు. అది దావీదు

పొందుకున్నాడు. నిత్యము స్తుతించడం ప్రారంభించాడు. నీ జీవితములో పాటల సీడీలు, క్యాసెట్లు, సెల్‌ఫోన్స్ పాడుతున్నాయి అరిగిపోతున్నాయి. నీవు ఎప్పుడైనా ప్రభుపాట పాడావా? ప్రభును ఆరాధించావా? దేవునిని ఆరాధించే జ్ఞానం నీకు లేనంతకాలము నీవు పశువువే. దావీదు ఏమైనా చదువుకున్నాడా? లేదు గొఱ్ఱెలు కాచుకునే గొఱ్ఱెల కాపరి. అడవుల వెంబడి, చెట్లు పుట్టలవెంబడి తిరిగే వాడు. ఆ అడవిలో ఎవరు ఆయన పాటను వింటారు? అడవిలో చెట్లు పుట్టలు, పక్షులు, జంతువులు, మృగాలు ఆలకిస్తుండగా దావీదు దేవున్ని స్తుతిస్తున్నాడు. దావీదు చెట్లను చూసి, పక్షులను, జంతువులను, ఆకాశాన్ని, సూర్యచంద్రులను చూసి ఏమన్నాడో తెలుసా దేవుడు సృజించిన వారలారా మీరందరు దేవున్ని స్తుతించండి, యేసయ్య పాటపాడండి అని ఆకాశానికి భూజంతువులకు, సూర్యచంద్ర నక్షత్రములకు ఆజ్ఞాపిస్తున్నాడు.

దావీదు మంచి ఆరాధికుడు, నోరు తెరిచాడంటే యేసయ్యపాటే, భోజనం చేస్తున్నా యేసయ్యపాటే, నడుస్తున్నా యేసయ్య పాటే, గొఱ్ఱెలను కాస్తున్న యేసయ్యపాటే, ప్రతిక్షణం అన్నివేళల యేసయ్యను స్తుతించి ఆరాధించే ఆరాధికుడు. మరి నీవు ఎలా ఉన్నావు? నీవు లేచినప్పుడు యేసయ్యపాట పాడావా? నీవు పని చేస్తున్నప్పుడు యేసయ్యపాట పాడావా? నీ ఆఫీసులో యేసయ్య పాటపాడావా? దావీదు అలా కాదు దావీదు పడుకున్నా, లేచినా, పరుగెత్తుతున్నా, నడుస్తున్నా, అది ఏపరిస్థితి అయినా దేవున్ని ఆరాధించే వాడు. గొఱ్ఱెలను కాస్తూ “యెహోవా నా కాపరి నాకు లేమి లేదు” అని అంటాడు, శత్రువులు వచ్చి ఆయన మీద పడుతున్నప్పుడు “మహోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తుని నీడను విశ్రమించువాడు, దేవుడే తన రెక్కల నీడలో నన్ను కాపాడతాడు” అని అంటాడు. కఠినమైన పరిస్థితులగుండా వెళ్ళవలసి వచ్చినప్పుడు “నా నీతికి ఆధారమగు దేవా, ఇరుకులో నాకు విశాలత కలుగజేసినవాడవు నీవే నన్ను కరుణించి నా ప్రార్థన అంగీకరించుము (కీర్తన 4)” అని పాడాడు. వేటగాడు వచ్చి ఉరి వడ్డినప్పుడు “వేటకాని ఉరిలోనుండి నన్ను విడిపించావు” అని పాడాడు. జయం కలిగిందంటే

“దేవుడే నాకు జయము ఇచ్చాడని” ఇలా రకరకాలుగా దేవుడు తన జీవితములో చేస్తున్న కార్యాలన్ని తలస్తూ దావీదు పాటలరూపములో ప్రభువును స్తుతిస్తూ, ఆరాధిస్తున్నాడు. నిత్యము దేవున్ని ఆరాధించే వానిగా దావీదు ఉన్నందువలన దావీదు దేవునికి ఇష్టానుసారమైన మనుష్యునిగా మారాడు.

ఏ క్రైస్తవుడైతే దేవున్ని రాత్రిపగలు ఆరాధిస్తారో, స్తుతించి ఘనపరుస్తారో ఆ క్రైస్తవుడు దేవుని దృష్టిలో అత్యంత ప్రియమైన వానిగా మారతాడు. క్రైస్తవుని నోట ఎప్పుడు స్తుతి ఉంటుంది. దేవున్ని ఘనపరచు మహిమపరచు నీవు కూడా ఆరాధించి ఆరాధికునిగా మారిపోవాలి. దేవునికి ఆరాధించేవారంటే చాలా ఇష్టము. దేవుడు నా జీవితములో ఏమిచేసాడు? అని ప్రతివిషయములో సణిగేవారు దేవున్ని స్తుతించలేరు. ఆరాధించలేరు. ప్రియమైన దేవుని బిడ్డలారా మనం సణిగేవారముగా దేవున్ని ధూషించేవారముగా కాకుండా దేవుడు చేసిన మేళ్ళను తలంచుకొంటూ దేవున్ని ఆరాధించే వారముగా బ్రతకాలి. దావీదు దేవున్ని ఆరాధించి దేవునికి ప్రీతికరముగా మారాడు.

## 2. ప్రార్ధనా పరుడు

దావీదు దినముకు 7 మార్లు ప్రార్ధన చేసే ప్రార్థనాపరుడు. నీ జీవితములో దినముకు ఎన్ని సార్లు ప్రార్థన చేనస్తున్నావు? అవసరానికే ప్రార్థన చేస్తున్నారా?ప్రత్యేకముగా ప్రతిదినము దేవుని సన్నిధిలో మోకరించి ప్రార్థనలో గడుపుతున్నారా? ప్రార్థనలో గడుపుదాం అనే ఆలోచన నీకు లేదు, నీ అవసరానికి చేసే ప్రార్థన అది ప్రార్థన కాదు. నీ అవసరము కాకుండా దేవుని సన్నిధిలో మోకరించి ఆయనతో గంటలు గంటలు ముచ్చటించాలనే ఆశతో, వాంఛతో, ఆకలితో వచ్చి దేవుని సన్నిధిలో రాత్రిపగలు ప్రార్థన చేయడమే నిజమైన ప్రార్థన. ఇలాంటివారే నిజమైన ప్రార్థనాపరులు దావీదు మహారాజు దినానికి 7సార్లు ప్రార్థన చేసాడు. దావీదు మంచి ప్రార్థనాపరుడు అందుకే దావీదు అంటే దేవునికి ఇష్టం. ఈరోజునీవు దేవునికి ఇష్టునిగా మారాలంటే ఏం చేయాలి?

ప్రార్థనాపరుడవై యుండాలి.

మన ప్రభువైన యేసుక్రీస్తులవారు దినమంతా సేవచేసేవాడు రాత్రంతా ప్రార్థనలో గడిపెడివాడు. ప్రార్థన చేయడానికి సమయంలేదని చెప్పుకుంటూ ఈలోకములో తిరుగుతున్న నీవు ఒక్కసారి ఆలోచించు! ప్రతిరోజు ప్రార్థనలో గడపడానికి దేవుడు ఎంతో సమయాన్ని నీకు ఇస్తున్నాడు. నీవు భోజనం చేస్తున్నప్పుడు గంటలసేపు భోజనం చేస్తున్నావు! పది నిమిషాలలో భోజనం ముగించుకొని మిగతా 50 నిమిషాలైనా ప్రార్థన చేయలేవా? ఇలాంటి ఎన్నో అనుకూల పరిస్థితులు ప్రార్థన చేయడానికి వచ్చినా నీవు మాత్రం సమయాన్ని వృధాచేస్తూ, ముచ్చట్లు పెడుతూ, సెల్‌ఫోన్‌లో ఛాటింగ్స్ చేస్తూ, పనికిరానివాటికొరకు తాపత్రయపడుతున్నావు కాని ప్రార్థనకు ముందుకు రావడం లేదు.

ప్రియచదువరి దేవునికి ఇష్టునిగా నీవు మారాలంటే ప్రార్థనపరుడవై, ప్రార్థనా పరురాలవై జీవించు, సమయాన్ని వృధాచేయక ప్రభుసన్నిధిలో ఎల్లప్పుడు మోకరించి గడిపే అనుభవాన్ని సంపాదించుకో దేవుడు నిన్ను తనకు ప్రియమైనవారిగా సాక్ష్యమిస్తాడు.

## 3. యధార్థవంతుడు

దావీదు యధార్థవంతుడు. ఆయన మాట, క్రియలన్నియు యధార్థముగా ఉంటాయి. కపటంలేనివాడు, కోపం లేనివాడు, ఈర్శలేనివాడు, అంతరంగములో ఏదో ఆలోచన పెట్టుకొని పైకిమాత్రం ఒకరకంగా వుండటం యధార్థతకాదు. లోపల బయట ఒకే రీతిగా నడిచే వ్యక్తులే యధార్థవంతులు. హృదయమంతా చీకటి కార్యాలతో నిండి పైకి భక్తిగా ప్రేమగా నటించేవారు యధార్థవంతులు కారు. వారు వేషధారులు. దావీదు యధార్థవంతుడు

నీవు యదార్థవంతునివి యధార్థవంతురాలవు అని అనుకుంటున్నావు. ఒకసారి నీ యధార్థతను పరీక్షించుకో దావీదును ఇష్టపడడానికి కారణమేమిటో తెలుసా? దావీదు యధార్థవంతుడు. నీ జీవితములో కూడా నీవు

యధార్థవంతునిగా యధార్థవంతురాలిగా నీవు జీవించాలి. ఇతరులమీద అంతరంగములో ఒక అభిప్రాయాన్ని పెట్టుకొని పైకి ఇంకోరకముగా మాట్లాడడం ఆకాశమందున్న దేవుడు నిన్ను చూసి ఇష్టపడడు. ఇతరులు చేసే పనిద్వారా నీకు కోపం వస్తుందా? అయితే యధార్థముగా కోపపడు, వారిని బాగుచేయాలని అనుకుంటున్నావా? అయితే మంచి మనస్సుతో బాగుచేయ్యి, ఎదుటివారిని మంచి ప్రయోజకులుగా తీర్చి దిద్దాలని అనుకున్నావా? యధార్థముగా ఆ పని చేయు. ప్రార్థనలో, పరిశుద్ధతలో సమర్పణలో ప్రతిపనిలో యధార్థత కనిపించాలి. అన్ని విషయాల్లో దావీదు యధార్థవంతుడు. యధార్థవంతులను దేవుడు ఇష్టపడతాడు. ఈ యధార్థమైన జీవితము నీకు వుందా?

## 4. నిజస్థితిని ఒప్పుకున్నాడు

తన నిజస్థితిని దావీదు ఒప్పుకున్నాడు. దావీదు చేయకూడని తప్పుచేసాడు. తర్వాత దేవుని సేవకుడువచ్చాడు. దావీదూ నీవు తప్పుచేసావు అని అన్నాడు. ఏమిటి? రాజునైనా నన్నే తప్పు చేసావని అంటావా? బ్రతకాలని ఉందా? లేదా? చావాలని ఉందా? అని ఎదురించలేదు. దైవజనుని మాటకు గద్దింపునకు లోబడి సింహాసనం మీదనుండి దిగి పశ్చాత్తాపపడి తన జీవితమును సరిచేసుకున్నాడు. మంచివాడంటే అది. తప్పును దాచిపెట్టడం కాదు, తప్పులు దాచిపెట్టేవాడు దేవునికి ఇష్టమైనవాడు కాదు. తప్పును ఒప్పుకోవాలి. రాజైన దావీదు దేవుని సేవకునిదగ్గర తనుచేసిన తప్పును ఒప్పుకున్నాడు. అతిక్రమములు దాచిపెట్టువారు వర్ధిల్లరు, వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువారు వర్ధిల్లుతారు.

విశ్వాసిగా నీవు ఎలా ఉన్నావు? మహారాజంతా గొప్పవానివా? నీ స్థితి చిన్నదైనా నీ తప్పును నీవు ఎందుకు ఒప్పుకోవు? ఎందుకు సమర్థించుకుంటావు? ఎందుకు ఇతరులమీద నిందవేవాపుతావు. దేవుడు వాక్యంద్వారా మాట్లాడుతున్నాడా? సేవకునిలోనుండి మాట్లాడుతున్నాడా? నీ పైనున్న నాయకుల లోనుండి మాట్లాడుతున్నాడా? నీ బలహీనతలు, నీ పొరపాట్లు దైవజనులు వ్రేలెత్తి

చూపించినప్పుడు నీ తప్పును పొరపాటును ఒప్పుకొని సమాధానపడు దేవుడు నిన్ను దీవిస్తాడు. దావీదు తనతప్పును ఒప్పుకొని తను సరిచేయబడ్డాడు.

దావీదు ఒకరోజు మందిరాన్ని కట్టడానికి సిద్ధమయ్యాడు. దేవుడు అన్నాడు గొఱ్ఱెలదొడ్డిలో నుండి నిన్ను తీసుకువచ్చాను. ఘనులకు కలిగిన పేరు నీకు కలుగజేసాను. అనిదేవుడు అంటే దావీదు గొఱ్ఱెలదొడ్డిలో ఉన్న నన్ను చేరదీసి సింహాసనంమీద ఇశ్రాయేలు ప్రజలకు రాజుగా పట్టాభిషేకం చేసి, ఘనులకు కలుగజేసిన ఆ ఘనతను నాకు కలుగజేసి ఇంత ఆధిక్యత నాకిచ్చి నా వంశాన్ని దీవిస్తానని, ఆశీర్వదిస్తానని వాగ్దానాలు చేసి నన్ను ఇంత అత్యధికముగా హెచ్చించుటకు నేను ఏపాటివాడను? అని తన పూర్వపు స్థితిని జ్ఞాపకం చేసుకున్నాడు. తాను రాజైనా ఏగుంటనుండి తీయబడినాడో మరచిపోలేదు.

ఈరోజు నీవు ఉన్నతమైన స్థానములో అధికారిగా నాయకునిగా వుండవచ్చు అయినా నీ నిజస్థితి నీ మొదటి స్థితిని నీవు మరచిపోవద్దు. మొదటి స్థితిని జ్ఞాపకం చేసుకున్నాడు. అందుకే దేవునికి దావీదు ఇష్టునిగా మారాడు. కాని నీవు గతంలో ఎంతో ఘోరాతి ఘోరంగా పాపపు బ్రతుకు బ్రతికావు. దేవుడు నిన్ను ఎన్నుకొని ఇంత ఘనమైన ఆధిక్యత నీకు ఇచ్చినప్పుడు ప్రభువా ఎక్కడో పెంటకుప్పమీద, మురికి కాలువలలో పడిన నన్ను తీసుకొని ఇంత ధన్యకరమైన జీవితం ఇచ్చావే అయ్యా! నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లిస్తున్నానని చెప్పి నీ పూర్వపు స్థితిని మరచిపోకుండా కృతజ్ఞత కలిగి వుండాలి. దావీదు మహారాజుగా మారినా తన స్థితిని మరచిపోలేదు. అందుకే నేను గొఱ్ఱెలదొడ్డిలో ఉండేవాన్ని అని అంటాడు. నీపూర్వ స్థితిని నీవు జ్ఞాపకం చేసుకుంటావా? దావీదు తనయొక్క పూర్వపు స్థితినిబట్టి కృతజ్ఞత కలవాడు గనుక దేవుడు దావీదును ఇష్టపడ్డాడు. నీ నిజస్థితిని నీవు ఒప్పుకో దేవునికి ఇష్టునిగా మారుతావు.

## 5. సమర్పణగలవాడు

దావీదు మంచి సమర్పణజీవితము గలవాడు. తాను బ్రతికినన్ని దినములు కష్టపడి దేవునిమందిరపు నిర్మాణం కొరకు కావల్సినవన్నిటిని సంపాదించిపెట్టాడు. బంగారాన్ని, వెండిని, ఇత్తడిని, ఇనుమును, ధనమును వెలగలరాళ్లను సంపాదించి

పెట్టాడు. తన కుమారుడైన సొలొమోనుతో అంటాడు- నా జీవిత కాలమంతా కూడా దేవుని మందిరము కట్టాలనే వాంఛగలవాడనై, ఆకలిగలిగి, ప్రయాసతో అన్నింటిని సంపాదించి పెట్టాను.

**"నేను బహుగా ప్రయాసపడి నా దేవుని మందిరమునకు కావలసిన బంగారపు పనికి బంగారమును, వెండిపనికి వెండిని, యిత్తడి పనికి యిత్తడిని, యినుపపనికి ఇనుమును, కఱ్ఱపనికి కఱ్ఱలను, గోమేధికపు రాళ్ళను, చెక్కుడు రాళ్ళను, వింతైన వర్ణములుగల పలువిధముల రాళ్ళను, మిక్కిలి వెలగల నానావిధ రత్నములను తెల్లచలువరాయి విశేషముగా సంపాదించితిని. మరియు నా దేవుని మందిరము మీద నాకు కలిగియున్న మక్కువచేత ఆ ప్రతిష్టితమైన మందిరమును నిమిత్తము సంపాదించిన వస్తువులు కాక నా స్వంతమైన బంగారమును వెండిని నా దేవుని మందిరము నిమిత్తము నేనిచ్చెదను (1 దిన 29:2)"**

దేవుని మందిరము కట్టాలని మనోవాంఛ కలిగిన దావీదు బహుగా ప్రయాసపడి సంపాధన సమకూర్చాడు. దేవుని మందిరము కట్టాలని ఎంతో శ్రమను సహించాడు. అందుకేదావీదు అంటే దేవునికి ఇష్టము. ఈరోజు నీవు దేవునికి ఇష్టమైన బిడ్డగా మారావా? దేవున్ని ఆరాధిస్తున్నావా? ప్రార్థన చేస్తున్నావా? సమర్పణ కలిగియున్నావా? యథార్థముగా నడుస్తున్నావా? నిజస్థితిని ఒప్పుకొని కృతజ్ఞత కలిగి బ్రతుకుతున్నారా? పై లక్షణాల అన్ని కూడా దావీదులో దేవుడు చూసాడు. అందుకే దేవునికి ఇష్టునిగా మారాడు. దావీదును దేవుడు ఆశీర్వదించి, హెచ్చించి ఘనపరిచి ఆ దావీదు వంశములోనే యేసుప్రభువు జన్మించాడు.

నీ హృదయములో యేసుప్రభువు జన్మించాడా? ఏది నీ భక్తి? ఏది నీ ప్రార్థనా? ఏది నీ సమర్పణ జీవితం? ఒకవేళ దేవుడు నిన్ను ఇష్టపడకపోతే ఈ ప్రపంచములో ఎవరు ఇష్టపడరు. దేవుడు నిన్ను ఇష్టపడకపోతే ఈ ప్రపంచములో ఎంతమంది నిన్ను ఇష్టపడినా లాభము లేదు. దేవునికి నీవు ఇష్టానుసారుడైన మనుష్యునిగా జీవించాలంటే ఆరాధించాలి, ప్రార్థించాలి, నిజస్థితిని ఒప్పుకోవాలి, సమర్పణ చేసుకోవాలి. ప్రభువు రాజ్యాన్ని ఈలోకములో స్థాపించాలి.

ఒక నిజమైన క్రైస్తవునిగా ప్రభువు రాకడ సమీపముగా ఉన్న ఈ దినములలో నీవు దేవుడు ఇష్టపడే భక్తిని చేయాలి. దేవునికి ఇష్టమైన బిడ్డలముగా ముందుకు

సాగుదుముగాక. దేవుడు మిమ్ములను దీవించును గాక.

ప్రార్థించండి! పాల్గొనండి!! దేవునిచేత దీవించబడండి !!!

# ఉపవాస పండుగలు

**తేదీలు: 2017 డిసెంబర్ 26వ తేదినుండి 2018 జనవరి 1వ తేదివరకు**

ముఖ్య ప్రసంగీకులు

# పరిశుద్ధాత్మ దేవుడు

**అందరికి ప్రేమపూర్వక ఆహ్వానము**

**వివరములకు,** నిస్సీ మినిస్ట్రీస్, నిర్మల్, **9390011485, 7702348500**

**ప్రార్థనా అంశములు**

*ఆశీర్వాదకరంగా జరుగునట్లు
*బలమైన వర్తమానాలకొరకు
*మంచి వాతావరణం కొరకు
*దైవజనుల ఆరోగ్యం కొరకు
*ఉజ్జీవం కొరకు
*అవసరతలు తీరునట్లు

**గమనిక :**

* ఈపత్రిక మీకు ఆశీర్వాదకరముగా ఉన్నట్లయితే ఇతరులకు పరిచయం చేయండి.
* మీ అడ్రస్‌ను ఈ మొబైల్ నంబర్‌కు **9390011485 - S.M.S** చేసినచో మీకు పత్రిక పంపించబడును.
* లేదా మీ ఈమేయిల్ ఐడి (E Mail ID) పంపినచో మీకు మేయిల్ చేయబడును.

**ఈ పరిచర్య నిమిత్తం కానుకలను, చెక్కులను, డిడిలను**

**ఈ క్రింది అడ్రస్సుకు పంపగలరు**

**M.Jayaraju SBI-Bank Branch: Nirmal**

**A/c No: 31665876753 IFSC Code: SBIN0006405**



ంచండి.

ఆశీర్వదించునట్లుగా

# నిస్సీ

## పాటల సి.డి.లు

1. నా దాగుచోటు నీవే
2. మహోఘనుడా
3. ఇంపైన సువాసన
4. కృతజ్ఞతార్పణలు
5. నా గమ్యము నూతన యెరుషలేము
6. ఇశ్రాయేలు దేవా
7. స్తోత్రార్పణ NEW

## విసిడిలు మరియు డివిడిలు

1. నేను మీకు క్షేమము కలుగజేసెదను
2. మలిన వస్త్రాలు
3. నాకు దీవెన దయచేయుము
4. నీ సూర్యుడికను అస్తమింపడు
5. ధైర్యము తెచ్చుకొనుము
6. నిరీక్షణ
7. నిన్ను నడిపించును
8. సౌందర్యము
9. ఐక్యత
10. ఆలోచన
11.సిలువను మోయుట
12. జయించిన వారికి ఆశీర్వాదము
13. దేవుని ఆత్మను నెమ్మది పరచుట
14. పైకి లేపు వాడు
15. షిత్తీము లోయ 1
16. షిత్తీము లోయ 2
17. యాకోబులో వంకరతనము లేదు
18. యాకోబు
19. బలవంతులుగా మార్చే దేవుడు
20. మీరు దేవుని వ్యవసాయమునైయున్నారు

## మా పుస్తక ప్రచురణలు

1. క్రైస్తవ కుటుంబం
2. నిస్సీ వర్తమానాలు
3. బ్రతుకు బ్రతుకుగా మారుట

## ప్రసంగముల ఆడియో సి.డి.లు

1. పాపములో మరణించుట
2 .పరిశుద్ధత గుర్చి దర్శనము
3 .రమ్యమైన గుడారము
4 .దహించు అగ్ని
5 .ఆమె దీపము ఆరిపోదు
6. బలవంతుని చేతిలో
7. నా క్షేమానికి ఆధారం
8. నీవేమి ధరించితివి
9. పక్షి రాజు
10. అగ్ని జ్వాలలు
11. దీన మనస్సు తో చేసిన ప్రార్ధన
12. దైవ నడిపింపు
13. అంజూరపు చెట్టు
14. పరలోకపు అగ్ని , పాతాళపు అగ్ని
15. కలత చెందనివాడు
16. ఉధ్యానవనము
17. సిద్ధపాటు
18. క్షయభీజము అక్షయ భీజము
19. ఎండిన ఎడారిలో లేతమొక్క
20. గోపురము
21.జయము మనదే
22. లెబనోను సౌంధర్యం
23. దైవజనుని మాట వినుట

పాటల సి.డి ఒక్కటి 50రూ॥. ప్రసంగములు ఒక్కటి 30రూ॥ విసిడి, డివిడి ఒక్కటి 50రూ॥లు కావలసినవారు పోస్టు ద్వారా మనియార్డరు పంపి వీటిని పొందగలరు. పోస్టల్‌చార్జీలు అదనం.
మా అడ్రస్ ...

Nissi Ministries, H.No. 1-3-132/A6
ShastriNagar, Nirmal-dist. 504106
Phone:08734-240147, 9390011485

Regd. of Newspaper of India
TELTEL/2015/60909

Regd. No. ADB/012/2012-14
License to post on concessional rates

Printed matter

To,

# నిస్సీ మినిస్ట్రీస్

శాస్త్రీనగర్, నిర్మల్ 504106

ఫోన్ : 08734-240147, 9390011485

Website: www.nissiministries.co.in

Email ID: nissi.jayadwajamu@gmail.com

Published By: M. Priyadarshini W/o M. jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal Dist. Pin: 504 106

Edited & Owned by: Pastor. M. Jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal Dist. Pin: 504 106

Printed at: Nissi Printing Press, Shastrinagar, Nirmal